రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొన్న మస్తాన్‌వలి


ముస్లిం, మైనార్టీ సెల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో తాడేపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ముస్లిం, మైనార్టీ సెల్ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి హాజరయ్యారు. ఈ సమావేశంలో అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకర్గ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు మట్లపూడి బాజీవలి పాల్గొన్నారు.

లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ


లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నరసింహారెడ్డి

బల్లికురవ: మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాతనగర్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఆంద్రా లక్ష్మయ్య (55) కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు పానెం నరసింహారెడ్డి పరామర్శించారు. బతుకుదెరువుకు తెలంగాణా రాష్ట్రానికి వలస వెళ్లి అనారోగ్యంపాలై లక్ష్మయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన లక్ష్మయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. లక్ష్మయ్య పెద్ద కుమారుడు వెంకటేష్, వలంటీర్‌గా అందించిన సేవలను నరసింహారెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కౌలుకార్డులు ఇచ్చేలా సహకరించాలి


పోస్టర్ పత్రాలు ఆవిష్కరిస్తున్న తహశీల్దార్, సంఘ సభ్యులు

అద్దంకి: భూ యజమానులు తమ భూమిని కౌలుకు సాగు చేసుకునే కౌలుదారులకు కౌలు కార్డులు ఇచ్చేలా సహకరించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అన్నారు. పంట సాగు ధ్రువీకరణ పత్రాల పోస్టర్‌ను తహశీల్దార్ శ్రీచరణ్‌తో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పంట సాగుదారుల చట్టం 2019 ప్రకారం భూ యజమాని కౌలుదారుకు కార్డు ఇచ్చినందు వలన ఎలాంటి నష్టం జరుగదనే హామీ ఇస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, కౌలు రైతులకు, రైతులే వరైనా సాగు చేసే పంటపైనే హక్కు ఉంటుందని, భూమిపైన ఉండదన్నారు. ఈ విషయం భూ యజమానులు తెలుసుకుని కౌలుదారులకు కార్డులు వచ్చేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ ఇన్‌చార్జుల సమావేశం

చీరాల: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జులతో బుధవారం బాపట్లలోని పార్టీ నూతన కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశానికి పార్టీ చీరాల నియోజకవర్గంలోని అన్ని విభాగాలు, అనుబంధ విభాగాలు వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు సోమవారం ఇక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరవుతారన్నారు. కావున సమావేశానికి పార్టీ కౌన్సిలర్లు, రాష్ట్ర అనుబంధ సంఘాల్లోని కమిటి సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులందరూ హాజరు కావాలన్నారు.

పర్చూరు(చినగంజాం): రాష్ట్ర ప్రజలకు బాబు చేసిన మోసాన్ని గుర్తు చేస్తూ వైఎస్సార్ సీపీ తలపెట్టిన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని 2వ తేదీ బుధవారం నుంచి ప్రారంభించనున్న దృష్ట్యా బాపట్ల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి తరలి రావాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. కావున పర్చూరు నియోజక వర్గానికి సంబంధించిన మండల పార్టీ కన్వీనర్‌లు, పార్టీ అనుబంధ విభాగం అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

రోటరీ సేవలకు గుర్తింపుగా అవార్డులు

పర్చూరు(చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా తొమ్మిది అవార్డులు లభించినట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో అవార్డులను రోటరీ డీజీ శరత్ చౌదరి అందజేశారు. గత 20 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న భవనం రాజగోపాల్‌రెడ్డికి, జిల్లా సేవలందించిన కేఎస్ఆర్‌కే ప్రసాద్‌కు, అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్రకు అవార్డులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రెసిడెంట్, సెక్రటరీ, కోశాధికారులు తోకల కృష్ణమోహన్, కోమటి అంజనేయులు, పంబి సదానందరెడ్డిలకు అందజేశారు.

నేడు గ్రామ దేవతల సారే మహోత్సవం

వేటపాలెం: వేటపాలెంలో వేంచేసియున్న గ్రామ దేవతలకు వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ దేవతల సారే మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మహిళా సంఘ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని కన్యకా పరమేశ్వరి, పోలేరమ్మ, గంగమ్మ, మహాలక్ష్మి, కనక నాగవరపమ్మ వార్లకు సారే మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సారే మహోత్సం నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

కొత్త పోలింగ్ కేంద్ర ఏర్పాటుకు పరిశీలన

సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని నెహ్రూ నగర్‌కాలనీలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు సోమవారం అధికారులు పరిశీలించారు. దానిలో భాగంగా ఈఆర్‌వో, ఏఈఆర్‌వో సిబ్బందితో కలిసి పరిశీలించారు. అలాగే మండలంలోని గురిజేపల్లిలో ప్రస్తుత పోలింగ్ కేంద్రం 60లో ఓటింగ్ 1200 మించినందున అదనపు పోలింగ్ కేంద్రాన్ని ప్రతిపాదించిన నేపథ్యంలో ఆమె కొత్త కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం

చీరాల టౌన్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక చక్కటి అవకాశమని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను తహశీల్దార్‌కు అందించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో నివేశన స్థలాలు, ఇంటి నిర్మాణం, నూతన పింఛన్లు, ఇతర వివిధ రకాల సమస్యలపై ప్రజలు 27 అర్జీలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పలు శాఖల ఉద్యోగులు ఉన్నారు.

మున్సిపల్ సమావేశంలో పనులకు ఆమోదం

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ అధ్యక్షతన స్థానిక కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో 15 అంశాల అభివృద్ధి పనులను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా అంగీకరించారు. కార్యక్రమంలో తొలుతగా ఆర్ఐ అర్జున్‌రావు అజెండాలోని 15 అంశాలను చదివి సభ్యులకు వినిపించారు. మున్సిపాలిటి పరిధిలోని డంపింగ్ యార్డులోనే మెటీరియల్ రికవరి ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్)ను ఏర్పాటు చేయడాన్ని ఆమోదం తెలిపారు. స్థానిక కట్టకిందపాలెంలో కల్వర్టు నిర్మాణం, గాజులపాలెంలోని గ్రావెల్ రోడ్డు, డ్రైనేజిల నిర్మాణానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్ర పాల్గొన్నారు.

గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి కృషి


కెవీపాలెంలో ఎంపికచేసిన కమిటీలతో కృష్ణబాబు

బల్లికురవ: గ్రామ, బూత్ కమిటీల ఎంపికతో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో గ్రామ, బూత్ కమిటీలు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయినా ప్రకటనలు, ఆర్భాటాలకే పరిమితం అయిందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయనందున వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజాదరణ పెరుగుతుందని చెప్పారు. గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడుగా గోగినేని వెంకట రామాంజనేయులు, షేక్ ఖాశిం, బూత్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడుగా బత్తినేని కృష్ణ, యెర్రిబోయిన లింగారావు, సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు దర్శి రామకృష్ణయ్య, పూరేటి వీరాంజనేయులు, బత్తినేని శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి ప్రేమవాహిని రథోత్సవం


వేటపాలెంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


చినగంజాం: భగవాన్ సత్యసాయి బాబా ప్రేమ వాహిని రథోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న రథయాత్ర సోమవారం చినగంజాం గ్రామంలోకి విచ్చేసింది. చినగంజాం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రథానికి ఘనంగా స్వాగతం పలికారు, గ్రామంలోని వీధుల్లో సాయిబాబా రథాన్ని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి కమిటీ నిర్వాహకులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

వేటపాలెం: జిల్లా సత్యసాయి సమితి ఆధ్వర్యంలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం సోమవారం వైభంగా నిర్వహించారు. ముందుగా రథోత్సవం రైల్వే స్టేషన్ రోడ్డులోని సత్యసాయి మందిరం నుంచి బయలు దేరి వేదమంత్రాలతో చిన్నారుల కోలాట, భజనలతో సంతరావూరు రోడ్డు మీదగా సెంటర్ నుంచి తిరిగి సాయి మందిరం వరకు చేరుకుంది. అనంతరం సత్యసాయి మందిరంలో దివ్యాంగ విద్యార్థికి ట్రై సైకిల్, పేద మహిళకు కుట్టు మిషన్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లాల అధ్యక్షులు ముంగర రాంబాబు, సమితి కన్వీనర్ రామిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.



క్షీరపురిలో కార్పొరేట్ వైద్య సేవలు

- గుంటూరు, విజయవాడ వెళ్లనవసరం లేకుండా అత్యాధునిక వైద్యసేవలు
- స్కాన్ సెంటర్లు, అత్యాధునిక ల్యాబ్‌లు ఏర్పాటు


చీరాల పట్టణ వ్యూ

చీరాల అర్బన్: చీరాల ప్రాంత ప్రజలు ఒకప్పుడు అత్యవసర వైద్యం కావాలంటే గుంటూరు, విజయవాడకు పరుగులు తీసేవారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు ఇప్పుడు చీరాలలో అందుబాటులోకి వచ్చాయి. దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేకుండా కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా చీరాలలో వైద్యరంగం అభివృద్ధి చెందింది. జనరల్ ఆపరేషన్లతో పాటు గుండెకు స్టంట్‌లు, పేస్‌మేకర్ వంటి ఆపరేషన్లు చీరాలలోనే జరుగుతున్నాయి. అలానే అత్యాధునిక ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లు కూడా ఏర్పాటు కావడంతో వివిధ వ్యాధులతో బాధపడే రోగులకు ఇక్కడే వైద్య సదుపాయాలు అందుతున్నాయి.

చీరాలలో అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ డాక్టర్ డి.రవికిరణ్, డాక్టర్ డి.నిరుపమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అత్యాధునిక ఐసీయూ, వెంటిలేటర్లు, ఆపరేషన్లు థియేటర్లు ఉన్నాయి. అలాగే జీవీఆర్ ఆల్ట్రాకేర్ హాస్పిటల్‌లో డాక్టర్ పల్లె ప్రదీప్ రతన్, డాక్టర్ స్వాతి చౌదరిలు అత్యవసర వైద్య సేవలందిస్తున్నారు. రమేష్ డయాబెటిక్ సెంటర్‌లో డాక్టర్ కొండపాటూరి రమేష్ వైద్యసేవలందిస్తున్నారు. లత హాస్పిటల్‌లో డాక్టర్ జి.రాజ్‌కుమార్, డాక్టర్ కే శేఖర్ యాదవ్‌లు వైద్యసేవలందిస్తున్నారు. ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. హైమా హాస్పిటల్‌లో డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు సుదీర్ఘకాలంగా వైద్యసేవలందిస్తున్నారు. స్థానిక సాల్మన్‌సెంటర్‌లోని బేరుపేటలో బేర్ క్రిష్టియన్ హాస్పిటల్‌లో విదేశాల నుంచి వైద్యనిపుణులు హాస్పిటల్‌కు వచ్చి రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. శ్రీ బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వంటి ఆస్పత్రులు వివిధ విభాగాల్లో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నాయి.

ప్రకృతి సేద్యం ఉత్పత్తులతో ఆరోగ్యం


కూరగాయలను ప్రదర్శిస్తున్న సిబ్బంది

మార్టూరు: ప్రకృతి సేద్యపు పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులతో ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే కాక జీవన ప్రమాణం పెరుగుతుందని మండల ప్రకృతి సేద్యపు అధికారి రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యపు పద్ధతుల్లో పండించిన ఉత్పత్తులను ప్రజలకు విక్రయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా కషాయాలను వాడవచ్చని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులతో కూడా భూసారాన్ని కాపాడవచ్చన్నారు. ప్రకృతి సేద్యం గురించి తెలుసుకోవాలనే రైతులకు, పెరటి తోటల ద్వారా అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు పండించాలనుకునే ఔత్సాహిక మహిళలు తమను సంప్రదించవచ్చని చెప్పారు.